
కథ

# 'లిమిటెడ్ ఓవర్స్'

- ఎ.ఆర్. స్వామి



**ఆఫీసుకి పోఖిడే శలవ్ప పెట్టి రావ్ప హడావ్పడిగా పరుగెత్తుకుంటూ లకిడీకాపూల్ బస్స్టాప్‌కి చేరుకున్నాడు. సమయం ఒంటిగంట దాటింది.**

ఎండ తీవ్రత హెచ్చుగా ఉంది. లంచ్ టైం అవడం వలన బస్సుల ట్రాఫిక్ పలుచబడింది. ఏవో కొద్దిగా బస్సులు నడుస్తున్నాయి. సాయంత్రం జనాలతో కలర్‌ఫుల్‌గా రద్దీగా ఉండే లకిడీకాపూల్ బస్‌స్టాప్ అట్టే జనం లేక చిన్నబోయింది. ఎలాగైనా రెండులోపు ఇల్లు చేరాలి. చాలా ఆతృతతో ఉన్నాడు రావు. తను బస్‌పాస్ తీసుకోవడం వలన ఆటోలో త్వరగా ఇల్లు చేరే ఆలోచనకి స్వస్తి చెప్పాడు. ఆటోలో ఇంటికి వెళ్ళాలి అంటే కనీసం పాతిక రూపాయలు ఖర్చవుతాయి.

ఇల్లు మధ్యాహ్నం రెండు లోపులో చేరగలనా లేనా ? టాస్ ఎవరు గెలుస్తారు ? మొదట బాటింగ్ ఎవరు చేస్తారు ? సచిన్ మ్యాచ్‌లో ఉన్నాడా, లేడా ? ఈ ప్రశ్నలు రావు మైండ్‌లో మెదలుతున్నాయి. ఇవే రావు ఆందోళన, ఆతృతలకి కారణాలు.

అవి ప్రపంచకప్ వన్‌డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు

జరుగుతున్న రోజులు. ఇండియా ఆస్ట్రేలియాల మధ్య డే నైట్ ఫైనల్. మాచ్ జరిగే రోజు ఎలాగైతేనేం రావు మధ్యాహ్నం రెండుగంటల లోపునే అమీర్‌పేటలో ఉన్న తన ఫ్లాట్‌కి చేరుకున్నాడు. ఇంటికి చేరుతూనే ముఖం, కాళ్ళు చేతులైనా కడుక్కోకుండా నేరుగా గదిలోకి వెళ్ళి టీవీ స్విచ్ ఆన్ చేశాడు. టీవీ ముందున్న సోఫాలో చతికిల పడ్డాడు.

రావు భార్య సరోజ వంటింట్లోంచి తొంగిచూస్తూ ఏం జరిగిందో ఈయనకి, ఇంత ఆయాసపడుతున్నారు. ఆఫీసు నుంచి ఎందుకిలా హఠాత్తుగా ఊడిపడ్డారు అని ఆలోచించసాగింది. అప్పటికే రావు ప్రశ్నల వర్షం కురిపించసాగాడు.

'ఏవోయ్ సరూ ? మొదట బాటింగ్ ఎవరిది ? ఇండియాదా ? ఆస్ట్రేలియాదా ? సచిన్ టీమ్‌లో ఉన్నాడా? కుంబ్లేని కూడా టీమ్‌లోకి తీసుకున్నారా ?'

ఈ మాచ్‌ల లైవ్ టెలికాస్ట్ ధర్మమా అని సరోజకి కూడా క్రికెట్ ఆటమీద కొంత అవగాహన, ఆ ఆట యొక్క ప్రాథమిక సూత్రాలు ఆ ఆటమీద కొంత మక్కువ ఏర్పడ్డాయి. రావు ఇద్దరి పిల్లలకి, సరోజకి, లిమిటెడ్ ఓవర్స్ మాచ్‌లు నాటి రూల్స్ రెగ్యులేషన్‌లు అంతో ఇంతో వంటబట్టాయి.

'ఏమిటి సంగతి ఆఫీసునుండి ఇంత త్వరగా ఊడిపడ్డారు ? ముందుగా బాత్‌రూమ్‌కి వెళ్ళి కాళ్ళు చేతులు ముఖం కడుగుకొని అప్పుడు ఆ టీవీ ముందు చతికిల పడండి. ఎందుకా ఖంగారు ? ఆ ఆట ఏదో ఇక్కడ నుండి మీరే ఆడుతున్నట్లు ఫీలయిపోతున్నారు. కొద్ది నిముషాల్లో కొంపలేం మునిగిపోవు. కొంత స్థిమితపడి అప్పుడు చూడండి ఆ మాచ్'' అన్నది సరోజ.

"ఈరోజు ఫైనల్ మాచ్ గదా ! మళ్ళీ నాలుగు సంవత్సరాల తరువాత గాని ఇటువంటి మాచ్ చూడలేం. అందునా మన ఇండియావాళ్ళకి ఈ ఛాన్స్ ఇరవై సంవత్సరాల తరువాత వచ్చింది. ఏ ఒక్క బంతీ మిస్ అవకూడదనే ఉద్దేశ్యంతోనే శలవుపెట్టి మరీ ఈ మాచ్ చూడడానికి పరుగున వచ్చాను''.

***

రావు స్నేహితుడు రాజు ఒక ప్రయివేట్ కంపెనీలో కంపెనీ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. దాదాపు ముప్ఫైవేల దాకా నెలజీతం. రావు ఉంటున్న ఫ్లాట్స్ ప్రక్కనే ఉంటున్నాడు. తండ్రి చనిపోయాక వచ్చిన ఆస్తిపాస్తులు బాగా ఉన్నాయి. పిల్లా జల్లా ఎవరూ లేరు. ఇవికాక భార్య తరపు నుండి కలిసివచ్చిన కొన్ని ఆస్తులు కూడా ఉన్నాయి. పదేళ్ళుగా సిటీలో ఉంటూ తను సంపాదించిన 'బ్లాకు వైటు' కూడా బాగానే ఉన్నాయి. ఇంత ఆస్తి, అంతస్తూ ఉన్నా అతనికి ఎల్లప్పుడూ సంపాదన ధ్యాసే. ఇప్పటికీ అక్కడ ఫ్లాట్‌రేటు ఎంత ? ఇక్కడ స్థలం రేటు ఎంత ? ఏ కంపెనీ షేర్లు కొంటే లాభదాయకం ? ఏ బాంకులో సొమ్ము పెడితే ఎక్కువ వడ్డీ ఇస్తారు ? ఇవే రాజు చర్చనీయాంశాలు. 'మొన్న ఆ కంపెనీ షేర్లు అమ్ముకోకుండా ఉంచుకుని ఉంటే ఈ పాటికి లక్షలు లాభించి ఉండేవి' - ఇటువంటి వేదనలు ఆవేదనలతో ఎల్లప్పుడూ సతమతమవుతూ ఉంటాడు రాజు.

సాయంత్రం ఆరుగంటలు కావస్తోంది. రాజు రావు ఇంటికి వచ్చాడు. రావు మంచి మూడ్‌లో మాచ్ చూస్తుండగా ...

"ఒరే ! రావూ ! మనం అలా బయటికి వెళ్దాం చిన్నపనుంది వస్తావా ?"

రాజుకి క్రికెట్‌పై పెద్ద మోజులేదు. రావుకి ఇంత ఇంటరెస్టింగ్ మూమెంట్‌లో బయటికి వెళ్ళడం ఇష్టంలేదు.

'బయటికి దేనికిరా ! ఇప్పుడు మాచ్ మంచి రసపట్టులో ఉంది. ఫైనల్ మాచ్ కదా ! ప్రతి బంతీ ఎంతో ముఖ్యమయినది. ఏ ఒక్క ఓవరూ మిస్ అవకుండా మాచ్ అంతా పూర్తిగా చూడాలని శలవు పెట్టి మరీ ఈ మాచ్ చూస్తున్నాను. అసలు ఆ చిన్నపని ఏమిటి ?"

"ఏం లేదురా మొన్న మా ఆఫీసు వాళ్ళు కొంపల్లి విలేజ్‌లో ఏదో వెంచరు స్టార్ట్ చేశారు. అక్కడ ఒక ప్లాట్

కొందామనుకుంటున్నాను. భవిష్యత్తులో ఆ లాండ్‌కి మంచి ఎప్రిషియేషన్ వస్తుంది. తరువాత అమ్ముకుంటే బోలెడంత లాభం. నువ్వు నాతో వస్తే మనిద్దరం కలిసి ఆ సైట్ వివరాలు మా హౌసింగ్ సొసైటీ నుండి తెలుసుకొని వద్దాం. తరువాత ఒక ఆదివారం వెళ్ళి సైట్ చూసివద్దాం".

"ప్రస్తుతానికి నువ్వు వివరాలు కనుక్కుని రా ! వచ్చే ఆదివారం సైట్ చూడ్డానికి నేను వస్తానులే. ఇప్పుడు మాచ్ మంచి ఇంటరెస్టింగ్‌గా ఉంది. ఈ పరిస్థితిలో నేను బయటికి రాలేనురా !" అని నచ్చచెప్పి రాజుని పంపేశాడు రావు.

ఫైనల్ మాచ్ విషాదంగా ముగిసింది. సచిన్ ఏదో ఊడబొడుస్తాడనుకుంటే కేవలం రెండు బంతులు మాత్రమే ఆడి, ఎక్కువ పరుగులేమీ చేయకుండానే అవుట్ అయిపోయాడు. ఇండియా ఓడిపోయింది. రావు ఉత్సాహం ఉల్లాసం అన్నీ నీరు గారిపోయాయి.

రావు రాత్రి భోజనం ముగించుకొని మంచంపై నడుం వాల్చాడు. ఏదో ఆలోచిస్తుండగా రాజు సాయంత్రం తన ఇంటికి రావడం, ఎక్కడో స్థలం కొంటాననడం జ్ఞాపకానికి వచ్చాయి. ఉన్న ఆస్తిపాస్తులతో, ధనంతో సంతృప్తి చెందక రాజు ఇంకా ఇంకా ధనం సంపాదిద్దామని ఎందుకు తాపత్రయ పడతాడు ? ఇంకా సంపాదించి ఎవరికి పెట్టాలి ? సంపాదించినదంతా తను అనుభవించగలడా ? ఇలా తెరలు తెరలుగా రావు మెదడులో రాజును గురించి ఆలోచనలు రాసాగాయి.

మనిషి జీవితంలో డబ్బు సంపాదన ఒకటే ప్రధానాంశం కాకూడదు. డబ్బుకంటె విలువైనది కాలం. కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం మనిషిగా మన కర్తవ్యం. కాలానుగుణంగా జీవితంలోని ఏఏ దశలో పొందవలసిన అనుభూతుల్ని, అనుభవాల్ని ఆయా దశలలో పొందుతూ ఉండాలి. ఆప్యాయతా అనురాగాలను ప్రక్కకు పెట్టి ధనార్జనే ముఖ్యోద్దేశంగా జీవించకూడదు. ఆప్యాయతానురాగాలకి, ప్రేమాభిమానాలకి కూడా మనసులో కొంత చోటు ఉండాలి.

మనిషి జీవితం కూడ నేను చూసిన **'లిమిటెడ్ ఓవర్స్ మాచ్'** లాంటిదే కదా ! జీవితమనే ఈ లిమిటెడ్ ఓవర్స్ మాచ్‌లో ప్రతీ అడుగూ ఆచి తూచి వేస్తూ ఉండాలి. ఉన్నదానితో సంతృప్తి చెందే స్వభావాన్ని మనిషి అలవాటు చేసుకోవాలి. అందని వాటి గురించి, అర్హత లేని వాటి గురించి ఆతృత చెందుతూ ఇంకా ఇంకా సంపాదించేద్దామనే దుగ్ధ కొంచెం తగ్గించుకోవాలి. చేతనైతే మనకున్న దానిలో కొంత ఇతరులకి ఇచ్చి సహాయపడాలి. ఈపనులు చేయవలసిన సమయంలో చేయక, చివరికి చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం ఉండదు. డబ్బుపోతే తిరిగి సంపాదించవచ్చుగాని విలువైన కాలంపోతే తిరిగిరాదు. అది గ్రహించి మనిషి నడుచుకోవాలి. ఈ నిజాన్ని గ్రహించకపోతే మన లిమిటెడ్ ఓవర్స్ అయిపోతాయి. చివరి బంతి వచ్చేస్తుంది. సచిన్ ఔటయ్యాక 'అయ్యో ఆ బంతి పొరపాటుగా ఆడాను. అలా ఆడకుండా ఉండి ఉంటే ఔటయ్యేవాణ్ని కాదు. మళ్ళీ ఆడతాను' అంటే అవకాశమిస్తారా ?

జీవితంలో మనం బ్రతికి ఉండే కాలం ఎంతో విలువైనది. దాన్ని వృధాచేయకుండా, అత్యాశలకి పోకుండా మనకున్నదానితో సంతృప్తి చెందడం చాలా మంచిది. గౌతమబుద్ధుడు అర్ధరాత్రి సంసారాన్ని విడిచి వెళ్ళి బోధి చెట్టు వద్ద గ్రహించిన సత్యం **'కోరికలే మనిషి దుఃఖానికి కారణమని'** మన కోరికల్ని అదుపులో ఉంచుకుని, ఉన్నదానితో సంతృప్తి చెందడం ఉత్తమం. ఇలా తెరలు తెరలుగా తనకి వస్తున్న ఆలోచనలతో నిద్రలోకి జారుకున్నాడు రావు ✪

✤ ✤ ✤ ✤ ✤